



పలాసలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న లోకేశ్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' యాత్రకు ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఆదివారం ఉదయం ఇచ్ఛాపురంలో ఈ యాత్ర ప్రారంభించగా.. పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోనూ కొనసాగింది. వైసీపీ పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ.. లోకేశ్ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. సీఎం జగన్ తీరుతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రానున్నది టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ.. ప్రజలకు భరోసా ఇచ్చారు. తన పర్యటనతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు.





పలాసలో చిన్నారిని ముద్దాడుతూ..

ఈ అప్పలరాజు.. ఓ అనకొండ

కొండలు కొండలనే మింగేస్తున్నాడు

- పలాస నియోజకవర్గంలో ఒక్క పనైనా చేశారా? ● టీడీపీ హయాంలోనే ఫ్లైఓవర్ పనులు ప్రారంభం
- సొంతపార్టీ వారినే వేధిస్తున్నారు.. ప్రజలు ఓలెక్కా? ● రూ.12కోట్ల విలువైన లాడ్జి కొన్నవాడు పేదవాడా?
- బర్రెల కొనుగోళ్లలో రూ.2వేల కోట్లు లూటీ చేశారు ● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- ఇచ్ఛాపురంలో శంఖారావం యాత్ర ప్రారంభం ● పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోనూ సభలు
- ప్రజల నుంచి అనూహ్య స్పందన ● టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలన.. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పూరించారు. ఆదివారం ఇచ్ఛాపురం వేదికగా ఈ యాత్ర ప్రారంభించి.. పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోనూ సభలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలన, మంత్రుల తీరుపై ధ్వజమెత్తారు. 'పలాసలో మంత్రి అప్పలరాజు.. కొండలను మింగే అనకొండ. అడ్డంగా కొండలకు కొండలను తవ్వేస్తూ దోచుకుంటున్నాడు. ఆయన పేరుకే డాక్టర్. కానీ వాస్తవానికి మంచి యాక్టర్. అహంకారానికి మానవరూపం. ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయరు. కనీసం రోడ్డు కూడా వేయరు. సొంతపార్టీ శ్రేణులనే వేధిస్తున్న ఆయనకు ప్రజలు ఓ లెక్కా?' అంటూ మంత్రి తీరుపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. 'రెండు నెలలు ఓపిక పట్టు బ్రదర్. వచ్చేది టీడీపీ ప్రభుత్వమే. మొత్తం విచారణ చేపట్టి.. వడ్డీతో సహా కక్కిస్తాం' అంటూ మంత్రిని ఉద్దేశించి హెచ్చరించారు. 'మంత్రి కూడా పేదవాడు అంటున్నాడు. మరి రూ.12కోట్ల విలువైన లాడ్జి ఎలా కొన్నాడో ప్రజలకు చెప్పాలని ఈ సభాముఖంగా అడుగుతున్నా. బర్రెల కొనుగోళ్లలో రూ.2వేల కోట్లు ప్రజధానాన్ని లూటీ చేశారు. నువ్వలరేవులో నగేష్ అనే మత్స్యకారుడు అక్కడ కాలేజీలో ఎలా చని పోయారో తెలియదు. మంత్రి గారు లాలూచీ పడి కనీసం ఆ కుటుంబానికి ఇప్పటివరకు న్యాయం చేయలేదు. పలాస నియోజకవర్గంలో ఐదుగురు మహిళలు ఎలా చని పోయారో తెలియదు. వారి కుటుంబాలకు న్యాయం చేయలేదు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక మొదటి వందరోజుల్లో ఆయా కుటుంబాలకు న్యాయం చేస్తాం. జీడిపిక్కల రైతులను ఆదుకుని మద్దతు ధర కల్పిస్తాం. ఆఫ్‌షోర్ ప్రాజెక్టును మొదటి మూడేళ్లలో పూర్తిచేస్తాం. కొబ్బరి, జీడిపప్పు, రీసెర్చ్ ఫెసిలిటీ కూడా ఏర్పాటు చేస్తాం. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామ'ని లోకేశ్ భరోసా ఇచ్చారు.



పలాసలో కొబ్బరి, జీడి చెట్ల కావిడిని మోస్తున్న లోకేశ్

కండువా ఊపి.. ఉత్సాహం నింపి

పలాసలో సభ పూర్తయిన తరువాత టీడీపీ కార్యకర్తల్లో జోష్‌ను నింపేందుకు నారా లోకేశ్ 'సైకో పోవాలి-సైకిల్ రావాలి' అనే పాట వేయాలని కోరారు. నిర్వాహకులు ఆ పాట వేయగానే లోకేష్ కండువా ఊపుతూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యకర్తలు కూడా నాట్యాలు చేయడంతో సభాప్రాంగణం కేరింతలు, చప్పట్లతో మార్మోగింది.



ఇచ్ఛాపురం, టెక్కలిలో శంఖారావం యాత్ర సభలకు హాజరైన ప్రజలు, టీడీపీ-జనసేన శ్రేణులు



లోకేశ్‌తో అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అశోక్, గౌతు శిరీష మాటామంతీ..

టెక్కలిని జిల్లా కేంద్రంగా మారుస్తా

- 175 స్థానాల్లో టీడీపీ, జనసేన కూటమి విజయం తథ్యం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు

టెక్కలి, ఫిబ్రవరి 11: 'రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తుంది. అందులో లోకేష్ కీలకపాత్ర వహిస్తారు. ఆయన సహకారంతో టెక్కలి నియోజక వర్గాన్ని జిల్లాకేంద్రంగా మారుస్తా'నని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం రాత్రి టెక్కలిలోని శంఖారావ సభలో ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వాలని, వంశధార ప్రధాన ఎడవకాలువ హిరమండలం నుంచి వజ్రపుకొత్తూరు వరకు కాలువ ఆధునీకరణకు చేపట్టాలని లోకేశ్‌ను కోరారు. 'టీడీపీ హయాంలో వంశధార ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తిచేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని పట్టించుకోలేదు. కాలువలన్నీ పూడికపోయి రైతులు సాగునీటి కోసం రోడ్డున పడ్డారు. రాష్ట్రాన్ని సీఎం జగన్ సర్వనాశనం చేశారు. రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో జగన్.. పేదవాడినని కొత్తరాగం అందుకుంటున్నార'ని అచ్చెన్న విమర్శించారు. సాక్షి పేపర్, టీవీ, బెంగుళూరులో ప్యాలెస్, హైదరాబాద్‌లో లోటస్‌పాండ్, తాడేపల్లి ప్యాలెస్, రూ.500 కోట్లతో రుషికొండలో కట్టిన ప్యాలెస్‌లు ఎవరివని ప్రశ్నించారు. 'టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టినవారి పేర్లను లోకేశ్‌బాబు రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నారు. నేను బుర్రలోనే ఫీడ్ చేసుకున్నాను. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో వారికి చక్రవడ్డీతో సహా సెటిల్ చేస్తా'నని అచ్చెన్న తెలిపారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో టీడీపీ, జనసేన కూటమి గెలుస్తుందని, పులివెందులలో కూడా టీడీపీ జెండా ఎగుర వేస్తామని స్పష్టం చేశారు.

జిల్లాకు ఇచ్చిన 60 హామీల సంగతేంటి?

- టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తే పథకాలు పునరుద్ధరణ
- వలసలు నివారిస్తాం.. నదులు అనుసంధానం పూర్తిచేస్తాం ● నారా లోకేష్ భరోసా

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లాకు ఇచ్చిన 60 హామీలను ఇంతవరకూ నెరవేర్చలేదు. వాటి సంగతేంటి? అని నారా లోకేశ్ ప్రశ్నించారు. వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులేవీ పూర్తిచేయలేదు. వంశధార, తోటపల్లి కుడి, ఎడమ కాల్వలు పూర్తిచేస్తామని చెప్పి మోసగించారు. నాగావళి కరకట్ట పనులు కూడా పూర్తిచేస్తామని చెప్పి మాటతప్పారు. మూతపడిన షుగర్ ఫ్యాక్టరీని కూడా తెరిపించలేదు. త్వరలో ఇంట్లో పెంచుతున్న కుక్కకు, పీల్చే గాలికి కూడా వలంటీర్ల ద్వారా పన్ను వసూలు చేసేలా జగన్ పాలన కొనసాగుతోంద'ని లోకేశ్ విమర్శించారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే ఉత్తరాంధ్రలో వలసలు నివారిస్తామని భరోసా ఇచ్చారు. వేదికపై ప్రసంగిస్తూ.. మధ్యమధ్యలో తన మామయ్య బాలకృష్ణ సినిమాల్లోని డైలాగ్‌లు చెబుతూ పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచారు.శంఖారావం అనంతరం టీడీపీ, జనసేన శ్రేణులతో లోకేశ్ ప్రతిజ్ఞ చేయించారు. పర్యటనలో భాగంగా పలు సమస్యలపై ప్రజాసంఘాల నుంచి వినతులు స్వీకరించారు. పలాసలో లోకేశ్ సభకు ఎవరూ వెళ్లరాదని మంత్రి ఆంక్షలు విధించినా.. ఊహించని స్థాయిలో జనం తరలిరావడం యాత్ర మరింత విజయవంతమైంది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతు శిరీష, మాజీమంత్రి గౌతు శివాజీ, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేం వస్తే..

- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తాం.
- నిరుద్యోగులకు నెలకు రూ.3వేల భృతి అందిస్తాం.
- రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయంగా ఇస్తాం.
- ప్రతిఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తాం.
- 18-59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తాము.
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం.
- నాగావళి, వంశధార నదులను అనుసంధానం చేస్తాం
- వంశధార మెయిన్ కాలువ లైనింగ్ పూర్తి చేస్తాం.
- అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో టిడ్కో ఇళ్లను అందజేస్తాం.
- మత్స్యకారులకు గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో ఆదుకుంటాం.
- కొబ్బరి, జీడి ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం.
- మహేంద్రతనయ, బహుదా ఆధునీకరణ పనులను పూర్తిచేస్తాం.
- ప్రత్యేక సెజ్‌ను ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం.
- వలసలు లేని ఉత్తరాంధ్రగా తీర్చిదిద్దుతాం.

- సోమవారం నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి లోకేశ్ నరసన్నపేట చేరుకుని బస చేశారు.



పలాసలో తెలుగు తమ్ముళ్ల సందడి

'శంఖారావం' విజయవంతం చేయండి

టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ జిల్లాలో చేపట్టిన శంఖారావం విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం ఆమదాలవలస, లావేరులో జరిగే సభల ఏర్పాట్లను నాయకులు పరిశీలించారు.

జగన్‌కు ఓటమి భయం: కళా

లావేరు: సీఎం జగన్‌కు ఓటమి భయంపట్టుకుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు తెలిపారు. చంద్రబాబు నాయుడు సీఎం కావడం ఒక చారిత్రక అవసరమని చెప్పా రు. లావేరులో ఈనెల 15న జరిగే టీడీపీ జాతీయ టీడీపీ ప్రధాన కార్య దర్శి నారా లోకేశ్ నిర్వహించే శంఖారావం సభా ప్రాంగణాన్ని ఆదివారం కళా వెంకటరావు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో జగన్‌కు పతనం ప్రారంభమైందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఐ.తోటయ్యదొర టీడీపీ నాయకులు లంకలపల్లి శ్రీనివాసరావు, కోరాడ వెంకటరావు, మాకన మల్లేష్, లంక శ్యామలరావు, గొర్లె విజయ్ కుమార్, పిన్నింటి భానోజీరావు, ముక్కు ఆదినారాయణ పాల్గొన్నారు.


లావేరు: సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కళావెంకటరావు

శంఖారావం యాత్రకు ముమ్మర ఏర్పాట్లు

నరసన్నపేట: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్రకు జమ్ము జంక్షన్ వద్ద సభా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల నుంచి సుమారు 20 వేల మంది క్రియాశీలక కార్యకర్తలు, నాయకులు, కేడర్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకోవాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు నేతలు ఆదివారం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. శంఖారావం సందర్భంగా అంతా పసుపుమయమైంది.

స్థల పరిశీలన

పాతపట్నం: పాతపట్నంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టనున్న శంఖారావం యాత్ర బహిరంగ సభ ఏర్పాట్లను మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట వెంకట రమణమూర్తి ఆదివారం పరిశీలించారు. స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శ్రీనివాస రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఈ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోకేశ్ మంగళవారం పాతపట్నంలో శంఖారావం కార్యక్రమం చేపట్టనున్నారని, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ నాయకులు పాల్గొన్నారు.


పాతపట్నం: సభాస్థలిని పరిశీలిస్తున్న కలమట రమణ

ఆమదాలవలసలో..

సరుబుజ్జిలి: ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్న లోకేశ్ బహిరంగ సభ వేదికను ఆదివారం టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సనపల ఢిల్లీశ్వరరావు పరిశీలించారు. వేదికతో పాటు సమావేశానికి హాజరు కానున్న శ్రేణులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటుచేశారు.

తరలిరండి

పొందూరు: వైసీపీ ప్రభుత్వ అక్రమాలపై లోకేశ్ తలపెట్టిన తలపెట్టిన పోరులో భాగంగా సోమవారం ఆమదాలవలసలో నిర్వహించనున్న శంఖారావం సభకు తరలిరావాలని టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగు యువత జిల్లా ప్రధానకార్యదర్శి బలగ శంకర భాస్కర్, పార్టీ పట్టణాధ్యక్షుడు ఎ.చినరంగ కోరారు. ఆదివారం పొందూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆమదాలవలసలో జరిగే సభకు ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావాలని కోరారు.


ఆమదాలవలసలో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

నరసన్నపేటలో లోకేశ్‌కు ఘన స్వాగతం

నరసన్నపేట, ఫిబ్రవరి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శంఖారావం యాత్రలో భాగంగా ఆదివారంరాత్రి నరసన్నపేట సమీపంలోని జమ్ము జంక్షన్‌కు చేరుకున్నారు. సభ ప్రాంగణం వద్ద ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి, కుటుంబ సభ్యులు బగ్గు సుగుణ, అర్చన, సునీతలతో పాటు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయనతో పాటు శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు ధర్మాన తేజ్‌కుమార్, గొద్దు చిట్టి బాబు, బైరి భాస్కరరావు, బెవర రాము, బోయన సతీష్, సురవరపు తిరుపతిరావు, బగ్గు గోవిందరావు, ఎంపీ అప్పలనాయుడు, వెలమల రాజేంద్రనాయుడు , రెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా ప్రభుత్వ సెక్యూరిటీ

జమ్ము జంక్షన్ వద్ద లోకేశ్ బస చేసిన స్థలం వద్ద పోలీసుల భద్రత నామమాత్రంగా కల్పించారు. కేవలం నామమాత్రంగానే పోలీసులు తక్కువగా ఉన్నారు. లోకేశ్ నరసన్నపేట చేరుకునేసరికి ఎస్ఐ అశోక్‌బాబుతో పాటు ఒక ఏఎస్ఐ మాత్రమే సభ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. మిగతా బలగా లేవీ కనిపించలేకపోవడం గమనార్హం. దీంతో లోకేశ్ ప్రైవేటు సెక్యూరిటీ అప్రమత్తమై బస చేసే టెంటు చుట్టూ కాపలాగా ఉన్నారు.


నారా లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న బగ్గు రమణమూర్తి దంపతులు

టీడీపీ విజయం తథ్యం

● పార్టీ రాష్ట్ర హెచ్ఆర్డీ మాజీ డైరెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు కలిశెట్టి

ఇచ్ఛాపురం: శంఖారావం కార్యక్రమంతో టీడీపీ విజయం తథ్యమని పార్టీ రాష్ట్ర హెచ్ఆర్డీ మాజీ డైరెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఇచ్ఛాపురంలో లోకేశ్ చేపట్టిన శంఖారావంలో కలిశెట్టి మాట్లాడుతూ.. యువగళం, శంఖారావం స్ఫూర్తితో పార్టీ మరో 45 ఏళ్లపాటు ముందుకు వెళ్లే పరిస్థితి కనిపిస్తోందన్నారు. లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరో 40 సంవత్సరా లకు చరిత్ర సృష్టించబోతుందన్నారు. సరికొత్త నాయకత్వం కోసం క్యాడర్, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు.రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి రాష్ట్రంలో అత్యధిక సీట్లు సాధించి అధికారంలోకి వస్తుందన్నారు. యువగళంతో సమర్థవంతమైన, సంపూర్ణ నాయకుడిగా లోకేశ్ ఎదిగారని పేర్కొన్నారు.


లోకేష్‌తో కలిశెట్టి అప్పలనాయుడు

విజయవంతం చేయండి: ఎంజీఆర్

పాతపట్నం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహిస్తున్న శంఖారావం విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు మామిడి గోవిందరావు కోరారు. స్థానికంగా తన కార్యాలయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈనెల 13న పాతపట్నం నియోజకవర్గంలో నిర్వహించనున్న శంఖారావానికి నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో ఐదు మండలాల నాయకులు కార్యకర్తలు, ఎంజీఆర్ అభిమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మామిడి గోవిందరావు (ఎంజీఆర్)

వేర్వేరు ఘటనలో నలుగురి మృతి

జిల్లాలో వేర్వేరు ఘటనలో ఆదివారం నలుగురు మృతిచెందారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాదచాయలు అలముకున్నాయి.

వంశధార నదిలో కాలుజారి వృద్ధుడు

గార: గార పంచాయతీ పరిధిలోగల కుమ్మరిపేటకు చెందిన మళ్ల జగ్గునాయుడు (86) ఆదివారం గార వద్ద వంశధార నదిలో కాలు జారి ప్రమాదవశాత్తు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జగ్గునాయుడు నది వద్దకి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లినట్లు చెప్పారు. ఆ సమయంలో కాలు జారి నదిలో పడి మృతి చెందాడు. ఆయన సోదరుడు కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ.కృష్ణప్రసాద్ తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు..

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం గ్రామానికి చెందిన మత్స్యకారుడు పుక్కళ్ల ధర్మారావు(65) గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. తోటి మత్స్య కారులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఎప్పటిలాగానే సముద్రంలో చేపల వేట కోసం తోటి మత్స్యకారులతో పడవలో ధర్మారావు వెళ్లాడు. వేట ముగిసిన అనంతరం తిరిగివస్తుండగా తెల్లవారు జామున రెండు గంటల సమయంలో ధర్మారావుకు ఒక్కసారిగా సముద్రంలో గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య దమయంతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వేటసాగించి కుటుంబాన్ని పోషించుకుంటున్న కుటుంబపెద్ద మరణించడంతో భార్య, పిల్లలు అనాథలుగా మారారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బాబూరావు కోరారు.

తెప్ప బోల్తా పడి..

రణస్థలం: కొచ్చెర్ల పంచాయతీ పరిధిలోని కొత్తముక్కాం గ్రామానికి చెందిన మత్స్య కారుడు కుందు ఆనంద్ (30) మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కుందు ఆనంద్‌తో పాటు మరో ముగ్గురు ఎం.పోతురాజు, కె.పొలిరాజు, కె.అమ్మోరు సముద్రంలో పీతల వేటకు శనివారం సాయంత్రం వెళ్లారు. పీతల వల సముద్రంలో వేసి తిరిగి వస్తున్న సమయంలో తీరం ఒడ్డున అలలు ఎక్కువ కావడంతో తెప్ప బోల్తా పడింది. ఆయనతో వెళ్లిన మరో ముగ్గురు సురక్షితంగా ఒడ్డికి చేరుకున్నారు. కుందు ఆనంద తెప్పకింద ఇసుకలో కూరుకు పోయాడు. ఆనందను బయటకుతీసి 108 వాహనంపై శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనంద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి కుందు పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు కేసునమోదు చేశారు.


ఆనంద్(ఫైల్)

టెక్కలి వద్ద రోడ్డు ప్రమాదంలో...

జలుమూరు: టెక్కలి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలతరియా పంచాయతీ ఎర్రన్నపేటకు చెందిన బల గోవిందరావు అలియస్ గోపి (26) మృతిచెందాడు. పలాస నుంచి టెక్కలి వైపు కారులో వస్తున్న గోవిందరావు టెక్కలి సమీపంలో లారీ ఢీకొని మృతిచెందాడు. దీంతో ఆయన స్వగ్రామం ఎర్రన్న పేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గోవిందరావు (ఫైల్)

గుర్తుతెలియని మృతదేహం గుర్తింపు

సంతబొమ్మాళి: మండలంలోని కోటబొమ్మాళి-నౌపడ రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు పలాస జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, లుంగీతో ఉన్న మృతదేహం గుర్తించామని చెప్పారు. మృతదేహాన్ని పలాస ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

పోలీసులకు పట్టుపడిన జూదరులు

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధిలోని లక్ష్ముడుపేట తోటలో ఆదివారం ముగ్గురు జూదరులు పోలీసులకు పట్టుబడ్డారు. పేకాట శిబిరంపై ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి కేసు నమోదు చేశారు. వారి వద్ద ఉన్న రూ.23,520 నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

18 నుంచి కమ్మసిగడాం జాతర

రణస్థలం: కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర ఈనెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనుందని కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం ఆలయంలో ఆవిష్కరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రథసప్తమి రోజున పెళ్లిరాట వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రవిచంద్ర, తేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీప్రసాద్, సింహాచలంరాయుడు, గోపిన కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేని సమావేశాలెందుకు?

● కోటబొమ్మాళి మండల సమావేశంలో వాకౌట్ చేసిన సభ్యులు

టెక్కలి: అధికారులు హాజరుకాని సమావేశాలు ఎందుకని, మాకు మాత్రం ఇతర పనులు లేవా అని జీయన్నపేట ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం కోటబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రోణంకి ఉమా అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు హాజరుకాకపోతే సమస్యలు ఎలా పరిష్కార మవుతాయంటూ వాకౌట్ చేశారు. ఆయనను పలువురు వైసీపీ ప్రజాప్రతినిధులు అనుసరించారు. 27 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కేవలం 11 శాఖల అధికారులు రావడంపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానంగా రెవెన్యూ శాఖ నుంచి ఎవరూ రాకపోవడంతో సభ్యు లు ఒక్కొక్కరూ బయటకు వెళ్లిపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. కేవలం 8 శాఖల పైనే సమీక్ష నిర్వహించారు. దీంతో అధికారులు సైతం చేసేదేమీ లేక సమావేశాన్ని ముగించేశారు.

ఆదిత్య ఆలయానికి పోటెత్తిన భక్తులు

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మాఘమాసం తొలి ఆదివారం కావడంతో భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ. 5,63,721 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.2,05,200, విరాళాల ద్వారా రూ.1,33,521, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,25,000 వచ్చినట్లు ఈవో డీఎల్వీ రమేష్‌బాబు తెలిపారు. కాగా స్వామివారిని విశాఖకు చెందిన బి.వెంకట వ్యాసా నగేష్, ఉష దంపతులు దర్శించుకుని శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,00,116 అందజేశారు. వారి ని అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.


భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

రేపటి నుంచి డోనర్ పాసులు తీసుకోవాలి

ఈనెల 16 రథసప్తమిని పురస్కరించుకుని సూర్యనారాయణ స్వామికి రూ. లక్ష ఆపైన విరాళం ఇచ్చిన దాతలు ఈనెల 13 నుంచి 15వ తేదీ సాయంత్రంలోగా ఆలయంలో డోనర్ పాసులను తీసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ పాస్‌పై దాతలు 16వ తేదీ తెల్లవారు జామున 12-30 నుంచి ఉదయం ఏడుగంటల వరకు మాత్రమే దర్శనానికి అనుమతించనున్నట్లు చెప్పారు. ఒక పాస్‌పై నలుగురు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.

మాఘ ఆదివారం ప్రత్యేక పూజలు

నరసన్నపేట: పట్టణంలో సూర్యనారాయణ స్వామి ఆలయంలో మాఘ ఆదివారం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మాఘ మాసంలో ప్రతీ ఆదివారం సూర్య నమస్కారాలతో పాటు విశేష పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. రథసప్తమి సందర్భంగా ఈనెల 15 రాత్రి నుంచి ఆలయంలో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉంచాలి

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. రూరల్ మండలంలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఎన్నికల్లో నిర్వర్తించే విధులు, ఎన్నికల నియమావళిపై శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలోని హెడ్ కానిస్టేబుళ్లు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు ఆదివారంశిక్షణ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసే నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త లపై అవగాహన కల్పించారు. సరిహద్దు తనిఖీ కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండి వాహనాలను పరిశీలించి అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. గతఎన్నికల సమయంలో నమోదైన కేసులను పరిశీలించి అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాపై దృష్టి సారించి, ప్రాపర్టీ స్వాధీనంలో నిబంధనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మూడురోజుల పాటు శ్రీకాకుళం,టెక్కలి,కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసులకు శిక్షణా తరగతులు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ వై.శృతి, డీపీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, శ్రీకాకుళం సీఐ ఎల్.సన్యాసినాయుడు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

● **లావేరు:** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. బుడుమూరులో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గొర్లె భాస్కరరావు, బెజ్జిపురం యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, పి.చిట్టిబాబు, కుప్పిలి అప్పన్న, చక్రధర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వెండి శఠగోపం బహూకరణ

గార: శ్వేతగిరిపై వెలసిన వేణుగోపాల స్వామికి శ్రీకాకుళానికి చెందిన కింతలి వరాహనరసింహగుప్త దంపతులు వెండిశఠగోపం బహూకరించారు. ఆదివారం ఆలయం వద్ద ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డికిశఠగోపం అందజేశారు. ఎం.సాయిశర్మ పాల్గొన్నారు. శ్వేతగిరి వద్ద ఆదివారం శోభా యాత్ర జరిగింది. ఉత్సవ మూర్తులను మేళతాళాలు, కోలాటంతో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మహేంద్రాడ రవికుమార్ శర్మ వసుంధర దంపతులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పాలవలసలో లూర్దుమాత పండుగ

బూర్జ: పాలవలసలో లూర్దుమాత దేవాలయం ఆవరణలో లూర్దుమాత పండుగను పాలవలస విచారణకర్త బుడుమూరు మహేంద్ర, మోనిసిగ్నోర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పీఠాధిపతులు రామరాల విజయ కుమార్, పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ ఏర్పాటును విరమించుకోవాలి

రణస్థలం: రణస్థలంలో ఫ్లైఓవర్ ఏర్పాటును విరమించుకోవాలని వ్యాపారులు కోరారు. ఆదివారం రణస్థలంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల కొంతమంది చేపడు తున్న సర్వే ఆందోళన కలిగిస్తోందని, కొన్నిచోట్ల 26 మీటర్లు, మరికొన్నిచోట్ల 31, 37 మీటర్లు మార్కింగ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణలో చాలా వరకు నష్టపోయామని, నేడు ఫ్లైఓవర్ నిర్మిస్తే పూర్తిగా నష్టపో తామని తెలిపారు. ఫ్లైఓవర్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు చెప్పారు. ఫ్లైఓవర్ సర్వేను అడ్డుకుంటామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

చింతాడపేట(పోలాకి): ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండి సన్మార్గం లో నడవాలని విశాఖపట్నం శివానందాశ్రమం స్వామీజీ విష్ణుదేవానంద సర స్వతి అన్నారు. ఆదివారం దండులక్ష్మీపురం పంచాయతీ కిల్లిబుచ్చెన్నపేట రామ యోగి సేవాశ్రమంలో సత్సంగం నిర్వహించారు. ఆశ్రమం అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, సిరిపురం శివానంద ధర్మక్షేత్ర స్వామి ప్రకాశానందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం స్పందించకుంటే ఆమరణ దీక్షలు

సంతబొమ్మాళి: మూలపేటలో నిర్మిస్తున్న పోర్టులో స్థానికులకు ఉద్యోగావకాశాలు, కాంట్రాక్ట్ పనులు ఇవ్వకుంటే త్వరలో ఆమరణ దీక్షలు చేపడతామని వైసీపీ మండల అధ్యక్షుడు జీరు బాబూరావు, నాయకులు సుగ్గు రామిరెడ్డి, బుడ్డా మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం భావనపాడులో వైసీపీ నాయకులు సమావేశమయ్యారు. దీనిపై ఇప్పటికే అధిష్ఠానానికి ఫిర్యాదు చేశామని, వారు స్పందించకుంటే నిర సన చేపడతామన్నారు. మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు శ్రీరంగం వీరాస్వామి, కొల్లిపాడు సర్పంచ్ సవరయ్య పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అవకతవకలపై విచారణ చేపట్టాలి

పొందూరు: పంచాయతీ పరిధిలో జగనన్న ఇళ్లపట్టాల వ్యవహారంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తాడివలస సర్పంచ్ తమ్మినేని మనెమ్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేదలు, ఇళ్లులేని పేదలకు ఇవ్వాల్సిన పట్టాలు ఇళ్లు ఉన్న వారికి, అధికారపార్టీ నాయకులు, ఉద్యోగులకు ఇచ్చారన్నారు. వైసీపీ నాయకులు కొంతమంది వద్ద డబ్బులు తీసుకుని ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో గతనెల 29న జిల్లాకేంద్రంలో స్పందనలో ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఘంటసాలకు నివాళి

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా ఎదురుగా పెంకి నాగేశ్వరరావు సంగీత కళాశాలలో ఘంటశాల వెంకటేశ్వరరావు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకులు మూర్తి, కామేశ్వరరావు, సి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం: ఎన్ఈఆర్

జి.సిగడాం: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని విజయనగరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) తెలిపారు. ఆదివారం జి.సిగడాంలో బీజేపీ మండలాధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం ఆధ్వర్యంలో 'పల్లెకుపోదాం-గడపగడపకు బీజేపీ' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేసి కేంద్రప్రభుత్వ పథకాలను వివరించారు. జి.సిగడాంలో రాత్రి బస చేశారు. నాయకులు మీసాల రామకృష్ణ, గట్టెం అప్పలరాజు, రమేష్ పాల్గొన్నారు.

లోకేశ్‌కు మంత్రి అప్పలరాజు బహిరంగ లేఖ

పలాస: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌కు రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు ఆది వారం బహిరంగ లేఖ రాసి పత్రికలకు విడుదల చేశారు. అందులో తన ఆస్తులుగా మాజీ మంత్రి గౌతు శివాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, ఆమె భర్త వెంకన్న చౌదరికి చెందిన ఆస్తులను చూపిస్తూ.. వాటిని ప్రజలకు పంచేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. తాను 2019లో ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత మంత్రిగా వ్యవహరిస్తున్నానని, అధికారంలో ఉండగా రూ.600 కోట్లు సంపాదించానని మీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారని వివరించారు. అయితే తన ఆస్తులు ఇవంటూ టీడీపీ నాయకులు గౌతు కుటుంబానికి చెందిన ఆస్తులను చూపిస్తూ.. తన ఆస్తులకు వారే బినామీలుగా ఉన్నారన్నారు. తాను రూ. 600 కోట్లు కాదని, రూ.వేల కోట్లు సంపాదించానని, ఈ ఆస్తులను ప్రజలకు పంచేందుకు తాను సిద్ధమన్నారు. లోకేశ్ ఈ ఆస్తులపై మాట్లాడాలని, లేకుంటే పంచేందుకు సిద్ధం కావాలన్నారు.

గ్రామాల్లో బాబు ష్యూరిటీ

జలుమూరు (సారవకోట): గొర్రెబంద గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఐటీడీపీ ఇన్‌చార్జి సురవరపు తిరుమపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దువ్వారి జయరాం తదితరులు పాల్గొన్నారు. జమ్ముజంక్షన్ వద్ద సోమవారం నిర్వహిం చనున్న నారా లోకేశ్ శంఖారావం యాత్ర సభకు కేడర్ అంతా తరలి రావాలని పార్టీ నాయకులు ధర్మాన తేజేశ్వరరావు, కత్తిరి వెంకటరమణ కోరారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. ● **పొందూరు:** మండలంలోని రాపాక పంచాయతీ ఇళ్ళయ్యగారిపేట గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కర్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నేతలు. కార్యకర్తలు పాల్గొన్నారు.● **సరుబుజ్జిలి:** వైసీపీ పాలనలోఅప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్ర పునర్నిర్మాణం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవింద రావు తెలిపారు. ఆదివారం మండలంలోని తెలికిపెంటలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

ప్రమాదరహిత రవాణా అందరి బాధ్యత

అరసవల్లి: ప్రమాద రహిత రవాణా వ్యవస్థ తీసుకురావడానికి అందరూ బాధ్యత వహించాలని ప్రజా రవాణా అధికారి విజయకుమార్ కోరారు. ఆదివారం ఆర్టీసీ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ కూడలి, డే అండ్ నైట్ జంక్షన్, మీదుగా విజయ గణపతి ఆలయం వరకు 1, 2వ డిపోల సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 2-డిపో మేనేజర్ రవిశంకర్ వర్మ, సహాయ మేనేజర్లు రమేష్, గంగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సన్యాసి నాయుడు, పాల్గొన్నారు.



టీడీపీలో జోష్

- లోకేశ్ ఎన్నికల శంఖారావం సక్సెస్
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన కేడర్
- కిటకిటలాడిన సభా ప్రాంగణాలు



ఇచ్ఛాపురం సభా వేదికపై లోకేశ్, రామ్మోహన్, రవికుమార్, అశోక్, దాసరి రాజు, పిసిని చంద్రమోహన్

ఇచ్ఛాపురం/టెక్కలి/పలాస/కవిటి/కంచిలి/సోంపేట/పలాసరూరల్/నరసన్నపేట, ఫిబ్రవరి 11: సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న వేళ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేశ్ ఆదివారం నిర్వహించిన ఎన్నికల శంఖారావం యాత్ర విజయవంతమైంది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో లోకేశ్ యాత్ర సక్సెస్ కావడంతో కేడర్‌లో జోష్ నింపింది. ఈ మూడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సభా ప్రాంగణాలు కిటకిటలాడాయి. టెక్కలిలో లోకేశ్‌కు టెక్కలి నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. సాయంత్రం 5.30గంటల సమయంలో సభా ప్రాంగణానికి చేరుకోగానే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. లోకేశ్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులతో సెల్ఫీలు దిగారు. రాత్రి 7.10 గంటల వరకు శంఖారావ యాత్ర ఉత్సాహంగా సాగడంతో టీడీపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



టెక్కలి సభకు హాజరైన టీడీపీ, జనసేన శ్రేణులు



టెక్కలిలో దివ్యాంగుడితో లోకేశ్ సెల్ఫీ



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన



యువ కార్యకర్తల సందడి

జగన్ పాలన అంతానికే శంఖారావం: ఎంపీ రామ్మోహన్

జగన్ పాలన అంతానికే లోకేశ్ శంఖారావం పూరించారని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇచ్ఛాపురం, టెక్కలి, పలాసలో జరిగిన లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. 'ఇచ్ఛాపురంలో లోకేశ్ యువగళం పాదయాత్ర ముగించాల్సి ఉన్నా కొన్ని అవాంతరాలతో రాలేకపోయారు. నేడు ఈ గడ్డపై శంఖారావంతో అడుగుపెట్టి లోకేశ్ తన మాటను నిలబెట్టుకున్నారు. ఈ ఐదేళ్ల తాడేపల్లి ప్యాలెస్‌లో గడిపిన జగన్‌రెడ్డి ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. చంద్రబాబు ఢిల్లీ వస్తే జగన్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. జగన్ ఢిల్లీ వస్తే ఆ పార్టీ ఎంపీలు ఒక్కరూ కూడా రాలేదు. జగన్ పనిఅయిపోయిందని వైసీపీ నేతలకు కూడా తెలిసిపోయింది. టీడీపీ అధికారంలోకి వస్తే పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు అన్ని పూర్తి చేస్తాం. 25మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్‌రెడ్డి మాట తప్పారు. ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే దమ్ములేక భయపెట్టి ఓట్లు వేయించుకోనేందుకు కుట్రలు పన్నుతున్నారు. ప్రకృతి విపత్తులకే భయపడని మేము జగన్ ఉడత ఊపులకు భయపడతామా? ఇచ్ఛాపురం నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే టీడీపీని గెలుపించుకోవాలి. టీడీపీ హయాంలో సాగునీటి కాలువల కోసం రూ.4కోట్లు ఖర్చుపెట్టాం. ఈ ఐదేళ్లలో కెనాల్స్‌లో తట్టెడు మట్టితీసిన పాపాన పోలేదు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తేనే రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తించాలి.' అని ఎంపీ తెలిపారు. ఇచ్ఛాపురంలో మరోసారి పసుపు జెండాను ఎగురవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, జోన్ పరిశీలకులు దామచర్ల సత్య, జనసేన జిల్లా అధ్యక్షుడు మోహన్, కిరణ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు చౌదరి బాబ్జి, ఎల్ఎల్ నాయుడు, బోయిన గోవిందరాజులు, బగాది శేషగిరి, పినకాన అజయ్ కుమార్, జీరు భీమారావు, బోయిన రమేష్, వై.వెంకన్నచౌదరి, వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, వసంతస్వామి, దాసరి తాతారావు, సూరాడ మోహనరావు, ఎ.రామకృష్ణ, సత్యం, రట్టి లింగరాజు, శాసనపురి మురళీకృష్ణ, మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

అచ్చెన్నకు హోంమంత్రి ఇవ్వండి

టీడీపీలో బాహుబలి అయిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నా యుడుకు టీడీపీ ప్రభుత్వంలో హోం మంత్రి పదవి ఇవ్వాలని ఎంపీ రామ్మో హన్‌నాయుడు లోకేశ్‌ను కోరారు. అచ్చెన్నకు హోంమంత్రి పదవి ఇస్తే వంద రెడ్‌బుక్‌లున్నా సరే న్యాయం చేసే సత్తా ఉందన్నారు. కుప్పం తరువాత రాష్ట్రంలో అభివృద్ధి జరిగిన నియోజకవర్గం టెక్కలి మాత్రమేనని, ఈసారి అచ్చెన్నను 50 వేల మెజార్టీతో గెలిపించాలన్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి వలసలు లేని విధంగా అభివృద్ధి చేయాలన్నారు. కింజరాపు కుటుంబం రాజకీయాల్లో ఉన్నంతకాలం టెక్కలి పొలిమేరల్లో ఇతర పార్టీల జెండాలు కనబడవన్నారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత ఢిల్లీలో చక్రం తిప్పుతామన్నారు. అచ్చెన్నాయుడును లక్ష్యంగా చేస్తూ అధికార పార్టీ అనేక కేసులు పెట్టి వేధించారని, అవన్నీ తట్టుకొని నిలబడ్డారని తెలిపారు. ● 'పలాసలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ఎక్కడా తట్టెడు మట్టి కూడా మంత్రి అప్పలరాజు వేయలేదు. కొండలు కబ్జా చేసిన ప్రాంతంలో ఆయన సెల్ఫీలు తీసుకోవాలి. అడుగడుగునా మంత్రి అవినీతికి పాల్పడి పలాస పరువు తీశారు. స్టీలు కుర్చీల ఎంపీ అని నన్ను తూలనాడారు. వాస్తవానికి ఇక్కడి నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు నేనే ఎంపీనన్న విషయం మంత్రి గుర్తించాలి. వైసీపీ ఎంపీలు ఎవరో రాష్ట్ర ప్రజలకు ఇప్పటివరకు తెలియదు. బాబాయ్‌ను హత్య చేసిన, భూకబ్జాలకు పాల్పడిన, అశ్లీల వీడియోలు తీసుకున్న ఎంపీలు అంటేనే ప్రజలకు తెలుసు. వైసీపీ సోషల్ మీడియాలో తప్ప పలాస కిడ్నీ ఆసుపత్రి ఎవరికీ వినియోగపడడం లేదు. నెఫ్రాలజిస్టులు లేని కిడ్నీ ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. మంత్రి కేవలం పబ్లిసిటీ కోసమే బిల్డింగ్‌లు కట్టి బిల్డప్ ఇస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎర్రన్నాయుడు ఉద్దానం రక్షితనీటి పథకం అమలు చేస్తే.. నారా లోకేశ్‌కు ఉద్దానం ప్రాంతాలకు శుద్ధ జలాలు అందించిన చరిత్ర ఉంది. ప్రస్తుతం రూ.700 కోట్లతో ప్రారంభించిన నీటి పథకం ద్వారా ఒక్క గ్రామానికైనా పూర్తిస్థాయి నీరు అందించారా?. పలాస అభివృద్ధి చెందాలంటే గౌతు శిరీషను గెలిపించాలి' అని ఎంపీ కోరారు. ● లోకేష్ శంఖారావం యాత్రలో పలువురు జేబుదొంగలు హల్‌చల్ చేశారు. జనం కిక్కిరిసి ఉండడంతో తమ చేతి వాటాన్ని ప్రదర్శించారు.

ఏ వర్గం సంతోషంగా లేదు

రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదు. పవన్‌కల్యాణ్ వంటి నాయకుడ్ని రాష్ట్రంలోకి రాకుండా జగన్ అడ్డుకున్నారని, 'అందుకే వైసీపీ విముక్తి ఆంధ్రప్రదేశ్‌కు ప్రతి ఒక్కరు కలిసి రావాలి. ఏటా డీఎస్సీ అని చెప్పి ఎన్నికల ముందు మభ్యపెడుతున్నారు.

-కిరణ్‌కుమార్, జనసేన ఇన్‌చార్జ్, టెక్కలి

లోకేశ్‌కు ఉద్దానం పంటల కావిడి

లోకేశ్‌కు పలాస నియోజకవర్గ టీడీపీ నాయకులు ఉద్దానం జీవధార పంటలైన జీడి, కొబ్బరి చెట్లును కావిడలో వేసి ఇచ్చా రు. వాటిని ఆయన తన భుజంపై పెట్టు కొని వేదిక వద్దకు వచ్చారు. ఉద్దానంలో జీడి, కొబ్బరి పంటల ద్వారా వేలాది మంది కుటుంబాలు జీవనం పొందుతున్నాయని నాయకులు ఆయనకు వివరించారు. తితలీ తుఫాన్ దెబ్బకు అధికంగా ఈ పంటలకు నష్టం వాటిల్లితే పరిహారం కూడా అందజేశారని తెలిపారు. అలాగే ఎక్స్‌కవేటర్ సహాయంతో గజమాలలను లోకేశ్‌కు వేశారు. పలాస జీడిపప్పు గుచ్ఛాన్ని వ్యాపారులు అందజేశారు.



టెక్కలి సభకు వస్తున్న మహిళలు

వినతుల వెల్లువ

లోకేశ్‌కు పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ● శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఉన్న సంప్రదాయ మత్స్యకార కండ్ర కులస్థులను ఎస్టీలుగా గుర్తించటంతో పాటు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని ఆ సామాజిక వర్గీయులు కోరారు. ●శ్రీకాకుళంలో సాంకేతిక కారణాలతో 7వేల మందికి తిత్లీ తుఫాన్ పరిహారం అందలేదని పలువురు విన్నవించారు. ● వంశధార-బాహుదా నదిని అనుసంధానం చేసి ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని రైతులు విన్నవించారు. ● జిల్లాలో 1998 డీఎస్సీ క్వాలిఫై అయిన 350మందిని రిగ్యులరైజ్ చేయాలని సంబంధిత అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ● బెంతు ఒరియా కులస్థులకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించా లని ఆ సామాజిక వర్గీయులు కోరారు. ● జగన్ ప్రభుత్వంలో తాము ఉద్యోగాలు కోల్పోయామని, తమకు న్యాయం చేయాలని గోపాల మిత్రలు విన్నవించారు. ● ఎక్స్‌సర్వీస్ మెన్‌లను అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ సైనికులు వినతి పత్రాన్ని సమర్పించారు. ● రాష్ట్రంలో 40వేల మందికి పైగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆర్ఎంపీ డాక్టర్లు విన్నవించారు. ● అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి బలైన తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ● 50 ఏళ్లకే తమకు పింఛన్ వర్తింపజేయాలని, కార్పొరేషన్‌లో తగిన ప్రాధాన్యత కల్పించాలని సామంత కులస్థులు కోరారు. ●అధికార పార్టీ అక్రమాలను ప్రశ్నించినందుకు తనపై అట్రాసిటీ కేసు పెట్టి వేధిస్తున్నారని కంచిలి టీడీపీ మండల కార్యదర్శి, ఎంపీటీసీ సభ్యుడు మాదిన రామారావు. లోకేశ్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వైసీపీ నేతల ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలపై ప్రశ్నించినందుకు తనపై కక్షగట్టారని వివరించారు. మరో రెండు నెలలు ఓపిక పట్టాలని, పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని ఆయనకు లోకేశ్ ధైర్యం చెప్పారు. ● ఐటీడీఏలో అన్ని ఉద్యోగాలు గిరిజనులతో భర్తీ చేయాలని, పలాస ఏంద్రంగా ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని ఆదివాసీ ఐక్యసేవా సంఘం ప్రతినిధులు విన్నవించారు. ● జీడి పంటకు మద్దతు ధర కల్పించి జీడి రైతులను ఆదుకోవాలని, జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.16 వేలకు 80కేజీల బస్తా కొనుగోలు చేయాలని శ్రీకాకుళం జిల్లా రైతాంగ సమస్య సాధన కమిటీ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ● టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా సంక్షేమ పథకాలు ఒడియా, తెలుగు బ్రాహ్మణులకు అందేవని, ప్రస్తుతం అవి నిలిచిపోయాయని, మరలా పునరుద్ధరించాలని రాష్ట్ర ఒడియా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి వినతిపత్రం అందించారు. కేవీటీ కులాన్ని ఓబీసీలో చేర్పించాలని ఆ కుల పెద్దలు వినతిపత్రం సమర్పించారు. కష్టాల్లో ఉన్న స్వర్ణకారుల సేవా సంఘాన్ని ఆదుకోవాలని ఆ సంఘం సభ్యులు వినతి పత్రం అందించారు. ● బాహుదా నదిలో తితలీ తుఫాన్‌కు కొట్టుకుపోయి న 11 గ్రోయిన్ల నిర్మాణంపైచర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు కోరారు. ● సీపీఎస్ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టి టీడీపీ అధికారం లోకి వచ్చిన వెంటనే అమలు చేసి న్యాయం చేయాలని యూటీఎఫ్ నేతలు కోరారు. అందరి సమస్యలను లోకేశ్ ఓపిగ్గా విన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



నరసన్నపేట: లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



కంచిలి : లోకేష్‌కు వినతి పత్రం అందిస్తున్న బెంతు ఒరియా నాయకులు రామారావు



టీడీపీ నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న లోకేశ్

టీడీపీ కార్యకర్తలను వేధించడమే మంత్రి పని: గౌతు శిరీష



టీడీపీ కార్యకర్తలను వేధించడమే ఇక్కడి మంత్రి అప్పల రాజు పని అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస సభలో ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాల నలో పలాస అభివృద్ధి శూన్యమన్నారు. చంద్రబాబు తెచ్చిన డయాలసిస్ కేంద్రాలు, కిడ్నీ పరిశోధన కేంద్రాలను వారి అభివృద్ధిగా చెప్పుకోవ డంపై ఆక్షేపించారు. నియోజకవర్గంలో కొండలన్నింటినీ ఆక్రమించి అమ్ముకున్న ఘనత మంత్రి అప్పలరాజుకే దక్కిందన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కేటీ రోడ్డును పూర్తి చేయలేదని.. అయితే మంత్రి నివాసం ఉంటున్న ప్రగతి భవన్‌ను శరవేగంగా నిర్మించుకు న్నారని ఆరోపించారు. మందస మండలంలో దామోదర్ సాగర్, డబారుసింగ్, కళింగదళ్ రిజర్వాయర్లు ఎవరి హయాంలో అభివృద్ధి జరిగాయో మంత్రి గుర్తుకు తెచ్చుకోవా లని హితవు పలికారు. తితలీ తుఫాన్ సమయంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ పలాస నియోజ కవర్గాన్ని చక్కదిద్దిన విషయం ప్రజలు ఇంకా గుర్తించుకున్నా రన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి, మంత్రి అప్పలరాజును ప్రజలు సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

పవన్ కల్యాణ్ వల్లే డయాలసిస్ కేంద్రాలు



పవన్ కల్యాణ్ వల్లే కిడ్నీ డయాలసిస్ కేంద్రాలు వచ్చాయి. వీటిని అప్పటి సీఎం చంద్రబాబు మంజూరు చేశారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.700 కోట్లు విడుదల య్యాయి. టీడీపీ-జనసేన ప్రభుత్వ ఏర్పాటైన తరువాత ఆఫ్‌షోర్ రిజర్వాయర్, మత్స్యకారుల కోసం విశాఖపట్నం-పారాదీప్ కారిడార్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. ఇక్కడి మంత్రికి కొండలు అమ్ముకోవడం తప్ప అభివృద్ధి చేతకాదు.

-దుర్గారావు, జనసేన నేత, పలాస

జగన్‌రెడ్డిని గద్దె దింపుదాం: దాసరి రాజు

జగన్‌రెడ్డిని గద్దె దింపేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్ చార్జి దాసరి రాజు పిలుపునిచ్చారు. శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. ఇచ్ఛాపురంలో 30వేల మందికి పైగా కిడ్నీ వ్యాధి గ్రస్థులున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్ఛాపురంలోని 200 పడకల ఆసుపత్రిలో కనీసం నెఫ్రాలజిస్ట్ లేకపోవడం దారుణమన్నారు. మినీ స్టేడియం నిర్మాణం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. జనసేన-టీడీపీ ప్రభు త్వంతో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.







లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కళావెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాజీ మంత్రి గౌతు శివాజీ



పలాస సభకు హాజరైన జనం



కార్యకర్తల నృత్యం



టెక్కలి సభలో మహిళా కార్యకర్తల సందడి



ఇచ్ఛాపురం సభకు హాజరైన టీడీపీ, జనసేన శ్రేణులు, ప్రజలు